నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, సోమవారం 28 అక్టోబర్ 2024 | SANGAREDDY

ఆదివారం సిద్దిపేటలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

హామీలిచ్చి మోసం చేసిన కాంగ్రెస్

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

సిద్దిపేట, అక్టోబర్ 27: అనేక హామీలిచ్చి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు ప్రజలను పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్‌తో కలిసి 127 మందికి రూ.28.65 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతుబంధు ఇవ్వాలని కాంగ్రెస్ అనేకసార్లు డిమాండ్ చేసిందన్నారు. నేడు అధికారంలోకి రాగానే రైతులకు రైతుబంధు ఇవ్వకుండా మోసం చేస్తున్నదని మండిపడ్డారు. ఆడపడచులకు రెండు బతుకమ్మ చీరలు ఇస్తామని చెప్పి ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్‌లో పెట్టిందన్నారు. కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పారని, తులం బంగారం దేవుడెరుగు కల్యాణలక్ష్మి కూడా ఇవ్వట్లేదన్నారు. నిరుద్యోగ యువతకు ఏడాదిలోపు లక్ష ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నా, 25 వేల ఉద్యోగాలకు కూడా నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. పీఆర్సీ ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. పేదోడికి ఇల్లు ఇవ్వకుండా.. ఉన్న ఇండ్లను కాంగ్రెస్ సర్కారు కూలగొడుతున్నదని విమర్శించారు. మహిళలకు రూ.2500 చొప్పున ఇస్తామని బాండ్ పేపర్ కూడా రాసిచ్చారని, ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదన్నారు. కేసీఆర్ హయాంలో సర్కార్ దవాఖానలో ఆడపిల్ల పుడితే 13వేల రూపాయలు ఇచ్చి, కేసీఆర్ కిట్ ఇచ్చి, తల్లీబిడ్డను క్షేమంగా ఇంటివద్ద దింపేవారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇవేవీ ఇవ్వడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కనుకరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు మల్లికార్జున్, మోయిజ్ పాల్గొన్నారు.

ఉద్యోగులను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

రిటైర్‌మెంట్ అయిన ప్రభుత్వ ఉద్యోగులు 600 మందికి బెనిఫిట్స్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించకపోవడం దుర్మార్గమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం సిద్దిపేటలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మన్మోహన్ ఉద్యోగ విరమణ వీడ్కోలు కార్యక్రమానికి ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు 15 డీఏలు ఇచ్చినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ ఇప్పటి వరకు ఒక డీఏ మాత్రమే ప్రకటించి ప్రభుత్వ ఉద్యోగులను నిరాశ పరిచిందన్నారు. ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ మూడేండ్ల తర్వాత చెల్లిస్తామనడం దుర్మార్గమైన విషయం అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసిన వారి వేతనాల నుంచి కొంత భాగాన్ని కట్ చేసి రిటైర్‌మెంట్ అయినప్పుడు ఇచ్చే బెనిఫిట్స్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉండడం బాధాకరమైన విషయం అన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వపోవడంతో ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, వారి బాధలను ప్రభుత్వం పట్టించుకోవాలన్నారు. బీర్ఎస్ హయాంలో రిటైర్మెంట్ అయిన చివర రోజే డబ్బులు ఉద్యోగి చేతికి వచ్చేవన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, నాయకులు పాల సాయిరామ్, ఎల్జీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్ కోమండ్ల విక్రం రెడ్డి, కాటం రఘురామ్, పూజల వెంకటేశ్వరరావు, భూపేశ్ తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగ విరమణ చేసిన మన్మోహన్ తనకు, కేసీఆర్ కుటుంబానికి ఎంతో ఆత్మీయులు అని, ఆయన శేష జీవితం ప్రశాంతంగా సాగాలని హరీశ్‌రావు ఆకాంక్షించారు.


ప్రభుత్వ ఉపాధ్యాయుడు మన్మోహన్ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రొటోకాల్ ఉల్లంఘన తగదు

- స్పీకర్ దృష్టికి తీసుకెళ్తా - నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- మెదక్ మెడికల్ కళాశాలను 50 సీట్లకు కుదించి అన్యాయం చేసిన కాంగ్రెస్ సర్కారు

ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్,అక్టోబర్ 27 : ప్రొటోకాల్ ఉల్లంఘనను శాసనసభ స్పీకర్ దృష్టికి తీసుకెళ్తానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి వెల్లడించారు. ఆదివారం మీడియాతో ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో అప్పటి మాజీ సీఎం కేసీఆర్ మెదక్‌కు వంద సీట్లతో మెడికల్ కాలేజీని మంజూరు చేశారన్నారు. దానిని 50 సీట్లకు కుదించి 24న మెడికల్ కళాశాలను మంత్రులు దామోదర్ రాజనరసింహ, కొండా సురేఖ ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం చేసి జిల్లాకు తీరని అన్యాయం చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ కళాశాల ప్రారంభోత్సవానికి మహిళ ఎమ్మెల్యే అయిన తనను ఆహ్వానించక అగౌరపరిచారని, కాంగ్రెస్ ప్రభుత్వానికి మహిళలంటే గౌరవం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ లేనివాళ్లను అధికారులు అధికారిక కార్యక్రమాల్లో వేదికల పైకి ఎలా పిలుస్తారని ఆమె మండిపడ్డారు. ఇటీవల హత్నూర మండలం దౌల్తాబాద్ ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభోత్సవంలో కూడా ప్రొటోకాల్ ఉల్లంఘించారని, ప్రొటోకాల్ ఉల్లంఘన అనేది పరిపాటిగా మారిందని ఆమె అసహనం వ్యక్తం చేశారు.

'బసవేశ్వర' పనులు చేపట్టాలి

- నిధులు కాజేసేందుకే బోరంచ ఎత్తిపోతల పథకం ప్లాన్
- నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆరోపణలు

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, అక్టోబర్ 27: మంత్రి దామోదర రాజనర్సంహకు నారాయణఖేడ్ నియోజకవర్గంపై, ఈ ప్రాంత రైతులపై చిత్రశుద్ధి ఉంటే కేసీఆర్ హయాంలో రూ.1,774 కోట్ల నిధులతో ప్రారంభించిన బసవేశ్వర ఎత్తిపోతల పథకం పనులను పూర్తి చేయాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి సూచించారు. సోమవారం మనూరు మండలం బోరంచలో పోచమ్మతల్లి ఎత్తిపోతల పథకాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఆదివారం మీడియాతో భూపాల్‌రెడ్డి మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బోరంచ నల్ల పోచమ్మ తల్లి ప్రాజెక్టు పేరిట ప్రస్తుత మంత్రి దామోదర చేతుల మీదుగానే పనులను ప్రారంభించి నాసిరకంగా చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత పథకాన్ని పునరుద్ధరించే దిశగా నిధులు మంజూరు చేయించినప్పటికీ, ఎన్నికల కోడ్ మూలంగా పనులు నిలిచిపోయాయన్నారు. తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ నిధులు కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని, హెచ్‌డీపీ పైపులకు బదులుగా డీఐ పైపులు వేసి నిధులను పక్కదారి పట్టించాలని చూస్తున్నారని ఆరోపించారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని ఏడు మండలాలు, అందోల్ నియోజకవర్గంలోని రెండు మండలాల్లోని 1.65 లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన బసవేశ్వర ఎత్తిపోతలతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందనే విషయాన్ని మంత్రి గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గంలోని నాగల్‌గిద్ద, నారాయణఖేడ్, కంగ్టి మండలాల్లో కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన ఎనిమిది కొత్త చెరువుల పనులను ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. చెరువుల పనులు చేపట్టే కాంట్రాక్టర్ల వద్ద కాంగ్రెస్ నాయకులు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు స్వప్రయోజనాలను పక్కనపెట్టి రైతులకు మేలు చేసే బసవేశ్వర ఎత్తిపోతలతో పాటు కొత్త చెరువుల పనులను ప్రారంభించాలని హితవు పలికారు.

అంతదూరంలో వద్దేవద్దు

- హుస్నాబాద్ పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఎంవీఐ ఆఫీస్‌కు స్థలం కేటాయింపు
- అందుబాటులో నిర్మించాలని ప్రజలు, వాహనదారుల వేడుకోలు

హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు పక్కన ఎంవీఐ కార్యాలయం కోసం కేటాయించిన స్థలం

హుస్నాబాద్, అక్టోబర్ 27: హుస్నాబాద్‌లోని మినీ స్టేడియంలో తాత్కాలికంగా నడుస్తున్న ఎంవీఐ యూనిట్ కార్యాలయానికి శాశ్వత భవన నిర్మాణంతో పాటు ట్రాక్, పార్కింగ్ తదితర అవసరాల కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. హుస్నాబాద్ పట్టణానికి సుమారు 3కిలోమీటర్ల దూరంలో ఎంవీఐ కార్యాలయానికి స్థలం కేటాయించడం, అందులో ఎల్లమ్మ చెరువును ఆనుకొని స్థలం ఉండటంతో భవిష్యత్‌లో భారీ వర్షాలు పడితే కార్యాలయం నీటమునిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హుస్నాబాద్‌లోని ఎంవీఐ కార్యాలయానికి నిత్యం వాహనాలతో పాటు వాహనదారులు, వివిధ లైసెన్స్‌ల కోసం ప్రజలు వస్తుంటారు. ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు కార్యాలయం నిర్వహణకు కావాల్సిన స్థలాన్ని కేటాయించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పట్టణ శివారులోని ఎల్లమ్మ చెరువును ఆనుకొని సర్వే నంబర్ 265/1లో స్థలాన్ని కేటాయించారు. ఆ స్థలాన్ని చదును చేయించారు. చదును చేసిన స్థలం కనీసం అర ఎకరం కూడా ఉండదని, ఇందులో ఎంవీఐ కార్యాలయం ఎలా నిర్మిస్తారని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. హుస్నాబాద్-రామవరం రోడ్డు డబుల్‌రోడ్డుగా నిర్మాణమైతే అక్కడ స్థలం మిగిలే అవకాశమే ఉండదని పట్టణ ప్రముఖులు అంటున్నారు.

కార్యాలయ నిర్మాణానికి 3నుంచి 5ఎకరాల స్థలం అవసరం

ఎంవీఐ కార్యాలయానికి కనీసం 3నుంచి 5ఎకరాల స్థలం అవసరమవుతుంది. వాహనాల ట్రయల్ రన్, డ్రైవింగ్ లైసెన్స్ కోసం వచ్చేవారికి డ్రైవింగ్‌పరీక్షలు నిర్వహించేందుకు కనీసం ఎకరం స్థలం కావాల్సి ఉంటుంది. మరో ఎకరానికి పైగా స్థలం పార్కింగ్ కోసం, మిగతా స్థలంలో కార్యాలయ నిర్మాణం జరగాల్సి ఉండగా నామమాత్రంగా స్థల కేటాయింపులు చేసి ప్రజలకు అందుబాటులో కార్యాలయం లేకుండా చేయడంపై ఆగ్రహం వ్యక్తవమవుతోంది. కేవలం రెండు ఎకరాల స్థలం కేటాయించి అధికారులు చేతులు దులుపుకొన్నారు. మినీ స్టేడియం పక్కనే సుమారు 4ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ అందులో కాకుండా ఊరికి 3కిలోమీటర్ల దూరంలో ఎంవీఐ కార్యాలయం ఏర్పాటుకు సన్నాహాలు చేయడంలో అంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే నిర్మించిన కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నందున ఈ కార్యాలయమైనా అందుబాటులో నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంవీఐ కొండల్‌రావును వివరణ కోరగా జిల్లా కలెక్టర్ రెండు ఎకరాల స్థలం కేటాయించారని, అధికారుల ఆదేశాల మేరకు స్థలాన్ని చదును చేశామన్నారు. ఊరికి దూరంగా ఎంవీఐకి స్థలం కేటాయింపు విషయం మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి వెళ్లిందా లేదా అనే విషయంపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

ఐదు ఎకరాల్లో ఎంవీఐ కార్యాలయ నిర్మాణం చేయాలి

ఎంవీఐ కార్యాలయానికి నిత్యం వాహనాలు, వాహనదారులు వస్తుంటారు. ఇది ప్రజలకు అందుబాటులో నిర్మించాలి. ఊరికి మూడు కిలోమీటర్ల దూరంలో నిర్మిస్తే ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడతారు. రెండు ఎకరాల స్థలం కేటాయించడం, చెరువు పక్కన కేటాయించడం ఏమాత్రం అనువైంది కాదు. కనీసం ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించాలి. ప్రస్తుతం నడుస్తున్న కార్యాలయం పక్కనే ఉన్న స్థలంలో ఏర్పాటు చేస్తే అందరికీ బాగుంటుంది. మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా అధికారులు దీనిపై పునరాలోచించాలి.

-పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, జీఎస్సీ నియోజకవర్గ ఇన్‌చార్జి -హుస్నాబాద్

నిధులు రాక నిలిచిన ప్రగతి పనులు

హుస్నాబాద్‌లోని నేతాజీనగర్‌లో నిర్మాణానికి నిధులు లేక నిలిచిన పార్కు వనాలు

హుస్నాబాద్ టౌన్, అక్టోబర్ 27: బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి పనులకు నిధుల వరదను పారించడంతో పట్టణ ప్రగతి పరుగులు పెట్టింది. కాంగ్రెస్ సర్కారు సుమారు పది నెలలుగా పట్టణ ప్రగతికి నిధులు విడుదల చేయకపోవడంతో అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయి. గతంలో చేసిన పనులకు సైతం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు కొత్తపనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. పట్టణాల్లో పలు రకాల అభివృద్ధి పనులను చేపట్టేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేకంగా పట్టణ ప్రగతికి 2020 ఫిబ్రవరిలో శ్రీకారం చుట్టింది. ప్రతినెలా ఆయా మున్సిపాలిటీలకు నిధులు మంజూరు చేయడంతో అనేక పనులు చేపట్టారు. కొత్తగా పార్కుల నిర్మాణం, జిమ్‌లు, శ్మశాన వాటికలు, మురుగుకాల్వలు, సీసీరోడ్లతో పాటు పలు రకాల పనులు చేపట్టారు. విద్యుత్ బిల్లులు, కార్మికుల వేతనాలకు సైతం ఇవే నిధులు వినియోగించేవారు. ప్రతినెలా హుస్నాబాద్ మున్సిపాలిటీకి రూ.10 లక్షల వరకు నిధులు మంజూరు అయ్యేవి. ప్రస్తుతం ఆ నిధులు రాకపోవడంతో పట్టణ ప్రగతి ముందుకు సాగడం లేదు. ఇంటి, నల్లాపన్నుల నుంచి వచ్చే ఆదాయం అంతంతమాత్రంగానే ఉండటంతో అభివృద్ధి పనులకు నిధులు లేక మధ్యలోనే నిలిచిపోతున్నాయి. హుస్నాబాద్ బల్దియాలో విద్యుత్ స్తంబాలు, వీధిదీపాల కొనుగోలుకు సైతం నిధులు లేని పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు ఇవ్వాలని ప్రజలతో పాటు ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. పట్టణ ప్రగతికి నిధులు రాకపోవడం వాస్తవమేనని, దీంతో ఇబ్బందులు అవుతున్నాయని వాస్తవమేనని హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ టి.మల్లికార్జున్‌గౌడ్ పేర్కొన్నారు.

మంత్రి కొండా సురేఖకు మల్లన్న చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ప్రధానార్చకుడు మల్లికార్జున్

యాదాద్రి తరహాలో అభివృద్ధి చేస్తాం..

- దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనం
- కల్యాణోత్సవం నాటిని అమ్మవార్లకు బంగారు కిరీటాలు

చేర్యాల, అక్టోబర్ 27 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణం వరకు బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలకు బంగారు కిరీటాలు తయారు చేయించి సమర్పించుకుంటామని దేవాదాయ, అటవీశాఖల మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఆదివారం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని మంత్రి కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మంత్రికి ఆలయవర్గాలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడారు. మల్లన్న ఆలయాన్ని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేస్తామన్నారు. కొమురవెల్లి మల్లన్న కల్యాణం వరకు 50గదుల ధర్మశాల నిర్మాణం పూర్తి చేసి ప్రారంభిస్తామని తెలిపారు.మల్లన్న జాతరకు వచ్చే భక్తులకు గదుల సౌకర్యం కల్పించేందుకు దాతల సహకారంతో ధర్మశాల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. డిసెంబర్ 28న జరిగే కొమురవెల్లి మల్లన్న కల్యాణం వరకు అమ్మవార్లకు కిరీటాలు తయారు చేయించేందుకు స్వామి వారికి సంబంధించిన బంగారు మిల్ట్ చేయించామని, కల్యాణం వరకు కిరీటాలు తయారు చేయిస్తామన్నారు.పూజల అనంతరం మంత్రికి ఆలయ ప్రధానార్చకుడు, ఏఈవో శ్రీనివాస్ మల్లికార్జున స్వామి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

భక్తులకు తిప్పలు..

కొమురవెల్లి మల్లన్న దర్శనానికి మంత్రి కొండా సురేఖ వస్తున్నారని తెలిసిన ఆలయ అధికారులు ఆదివారం ఉదయం నుంచి భక్తుల వసతులు మరిచి ఆమె కోసం ఏర్పాట్లు చేశారు.మంత్రి వచ్చే దారిగుండా ఎల్లమ్మ దేవాలయానికి కలినడకన వెళ్తున్న భక్తులను పోలీసులు వెనక్కి తిప్పి పంపించడంతో ఎల్లమ్మ వద్దకు వెళ్లేందుకు భక్తులు తిప్పలు పడ్డారు. దేవాలయం వద్ద వాహన పూజలకు వచ్చిన భక్తులను సైతం ఆలయ సిబ్బంది, పోలీసులు వెనక్కి పంపించారు. మంత్రి పర్యటన నేపథ్యంలో ఆలయ అధికారులు హడావిడి చేసి తమకు ఇబ్బందులు కలిగించడం తగదని భక్తులు పెదవి విరిచారు.

జోగిపేటకు పూర్వవైభవం తెస్తాం

- నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో మరింత అభివృద్ధి చేస్తా
- రూ. 78కోట్లతో మంజీరా నదిపై వంతెన నిర్మిస్తాం
- రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ
- జోగిపేటలో మార్కెట్ కమిటీ కొత్తపాలకవర్గం ప్రమాణస్వీకారం

ప్రమాణ స్వీకారం చేస్తున్న జోగిపేట ఏఎంసీ పాలకవర్గం సభ్యులు

అందోల్, అక్టోబర్ 27: జోగిపేట పట్టణాన్ని అన్నిరంగాలో అభివృద్ధి చేసి పూర్వవైభవం తెస్తానని రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం జోగిపేటలో మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పాలకవర్గంతో ప్రమాణస్వీకారం చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందోల్ నియోజకవర్గాన్ని అంచలంచెలుగా అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. జోగిపేటను వ్యాపార పరంగా మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రూ. 78 కోట్లతో మంజీరా నదిపై వంతెన నిర్మించి అజ్జమర్రి నుంచి జోగిపేటకు విశాలంగా రోడ్డు మార్గం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మార్కెట్ యార్డులో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొత్త పాలకవర్గం కృషిచేయాలన్నారు. మార్కెట్లో మౌలిక వసతుల కల్పనకు రూ. 5 కోట్లతో ప్రతిపాదనాలు రూపొందించామని, త్వరలో అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, వీటిని ఇండ్లులేని అర్హులైన పేదలకు అందజేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని హైవేలపై 75 ఎమర్జెన్సీ ట్రామాకేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రూ. 40 కోట్లతో అందోల్‌లో నర్సింగ్ కళాశాల, 100 పడకలతో అత్యవసర సమయంలో వైద్యం అందించేలా మల్టీ స్పెషాలిటీ దవాఖానను నిర్మిస్తున్నామని చెప్పారు. అనంతరం మంత్రిని పలువురు ఘనంగా సన్మానించారు. తిరుగు ప్రయాణంలో ప్రభుత్వ దవాఖానను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేసి, అజ్జమర్రి-జోగిపేట రోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీ సురేశ్‌షెట్కార్, ఆర్డీవో పాండు, ఏఎంసీ చైర్మన్ మక్త జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కమిషనర్ తిరుపతి, ఏఎంసీ కార్యదర్శి సునీల్‌కుమార్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివరాజ్, శేషారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ పద్మనాభరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రవీణ్, కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, దుర్గేశ్, చందర్‌నాయక్, నాయకులు మర్వెల్లి సంగమేశ్వర్, దుద్దాల శ్రీశైలం, వీర్ మల్లప్ప, రాజిరెడ్డి, ప్రదీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సగం చెరువు అన్యాక్రాంతం

- 11 ఎకరాలకు 6 ఎకరాలకు పరిమితమైన తాళ్లకుంట చెరువు
- చెరువును కాపాడాలంటున్న గ్రామస్తులు

కబ్జాకు గురైన ఐనాపూర్ తాళ్లకుంట చెరువు

కొమురవెల్లి, అక్టోబర్ 27 : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని ఐనాపూర్ తాళ్లకుంట చెరువు ఒకప్పుడు 60 ఎకరాలకు ఆయకట్టుకు నీరందించింది. గ్రామస్తులకు ఆదెరువుగా నిలిచింది. అలాంటి చెరువు కబ్జాకోరల్లో చిక్కుకోవడంతో సగం ఆయకట్టుకు నీరందించని పరిస్థితికి చేరింది. చెరువుకు హద్దులు ఏర్పాటు చేసి పరిరక్షించాలని అనేకసార్లు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకున్న నాథుడే కరువయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాళ్లకుంట చెరువులో ఇటీవల మహిళలు బతుకమ్మ నిమజ్జనం చేసేందుకు కూడా చాలా ఇబ్బందులు ఎదురైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఇటీవల గ్రామస్తులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో తాళ్లకుంట చెరువును ఇరిగేషన్ ఏఈ శశిధర్‌రెడ్డి పరిశీలించారు. త్వరలోనే హద్దులు ఏర్పాటు చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చి వెళ్లారు. మరోసారి ఇరిగేషన్ డీఈ శ్యామ్, ఏఈ శశిధర్‌రెడ్డి, గ్రామస్తులతో కలిసిచెరువును పరిశీలించారు. గ్రామానికి వచ్చిన ఇరిగేషన్ డీఈ శ్యామ్‌కు మాజీ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. చెరువుకు హద్దులు ఏర్పాటు చేసి కబ్జాదారుల నుంచి కాపాడాలని కోరారు. చెరువు మరింత అన్యాక్రాంతం కాకముందే చెరువును సర్వేచేసి పరిరక్షించాలని కోరుతున్నారు. త్వరలో చెరువును సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తామని గ్రామస్తులకు ఇరిగేషన్ డీఈ శ్యామ్ హామీ ఇచ్చారు.

తాళ్లకుంట చెరువును పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ శ్యామ్ (ఫైల్)